
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

TELTEL/2022/83842
PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
బుధవారం 08, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :203 | పేజీలు :4 | వెల. 3/-




## మానవత్వం చూపండి
## : కార్యదర్శుల వేడుకోలు

పంచాయతీరాజ్ వ్యవస్థకు వెన్నెముకలాంటి కార్యదర్శులపై 'డిప్యూటేషన్' అస్త్రం విసిరిన జిల్లా యంత్రాంగం.. వారి బతుకులను రోడ్డున పడేసింది. ఉగాది పండుగ తెచ్చిన కొత్త ఉత్సాహం కంటే, కలెక్టర్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు వారి గుండెల్లో ఎక్కువ రైళ్లను పరిగెత్తిస్తున్నాయి. నియోజకవర్గాల సరిహద్దులు చెరిపేస్తూ, భౌగోళిక పరిస్థితులను విస్మరిస్తూ, ఏకంగా 482 మందిని ఒకే దెబ్బకు సామూహికంగా తరలించడం జిల్లా చరిత్రలోనే ఒక సంచలనంగా మారింది. కేవలం పరిపాలనా సౌలభ్యం అని పైకి చెబుతున్నా.. ఈ నిర్ణయం వెనుక ఒక శక్తివంతమైన రాజకీయ హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం మానవీయ కోణంలో చూడాల్సిన గర్భిణీలు, వికలాంగులను సైతం అటవీ ప్రాంతాలకు, కొండకోనలకు పంపడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. గతంలో సొంత జేబుల నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేసిన కార్యదర్శులు.. ఇప్పుడు ఆ బకాయిలు రాక, కొత్త చోట ఇమడలేక, నిత్యం 50 కిలోమీటర్ల ప్రయాణం చేయలేక అగమ్యగోచర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇది కేవలం బదిలీ కాదు.. తమ ఉనికిపై జరిగిన దాడి అని కార్యదర్శులు ఘోషిస్తున్న వైనం 'మానుకోట' గడ్డపై ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

— హైదరాబాద్, ప్రభాత గమనం

2

# పంచాయతీ కార్యదర్శులకు
# బదిలీ కష్టాలు

- 18 మండలాల పరిధిలో 482 పంచాయతీల్లో సామూహిక డిప్యూటేషన్లు
- అన్ని చోట్ల ఒకేసారి తరలించడంపై తీవ్ర చర్చ
- నియోజకవర్గ హద్దులు దాటి సుదూర ప్రాంతాలకు బదిలీలు.
- గర్భిణీలు, వికలాంగుల పట్ల కనికరించని జిల్లా యంత్రాంగం.
- సొంత డబ్బులు ఖర్చు చేసి.. ఇప్పుడు బకాయిల కోసం ఎదురుచూపులు.
- మంత్రి మౌఖిక ఆదేశాలతోనే భారీ స్థాయిలో స్థానచలనం?
- డిప్యూటేషన్ పై పునరాలోచన చేయాలంటున్న పలువురు కార్యదర్శులు

## హత్య కేసులో
## రౌడీ షీటర్ కు జీవిత ఖైదు

03

## పాఠశాల, ఆసుపత్రుల్లో కలెక్టర్ తనిఖీ



- హాస్టళ్లలో భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

4

# నిబంధనలు గాలికి..

- రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు!
- కోరుకొండపల్లిలో నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఉపాధి హామీ పథకం నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన ఈ పనుల్లో నిబంధనలు తుంగలో తొక్కారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఆర్ అండ్ బి రోడ్డు నుండి మాచర్ల లక్ష్మయ్య ఇంటి వరకు నిర్మించిన ఈ రోడ్డు కనీసం పది నెలలైనా మనుగడలో ఉంటుందా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



3

బుధవారం
08.04.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక




- 18 మండలాల పరిధిలో 482 గ్రామ పంచాయతీలు
- అన్ని చోట్ల ఒకేసారి తరలించడంపై తీవ్ర చర్చ
- నియోజకవర్గ హద్దులు దాటి సుదూర ప్రాంతాలకు బదిలీలు.
- గర్భిణీలు, వికలాంగుల పట్ల కనికరించని జిల్లా యంత్రాంగం.
- సొంత డబ్బులు ఖర్చు చేసి.. ఇప్పుడు బకాయిల కోసం ఎదురుచూపులు.
- మంత్రి మౌఖిక ఆదేశాలతోనే భారీ స్థాయిలో స్థానచలనం?
- డిప్యూటేషన్ పై పునరాలోచన చేయాలంటున్న పలువురు కార్యదర్శులు

# పంచాయతీ కార్యదర్శులకు బదిలీ కష్టాలు

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

మహబూబాబాద్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల డిప్యూటేషన్ల వ్యవహారం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఉగాది పండుగ ముందే ఊహించినట్లుగానే, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ నెల 4వ తేదీన భారీ ఎత్తున బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఉన్న 482 గ్రామ పంచాయతీల కార్యదర్శులందరినీ ఒకేసారి డిప్యూటేషన్‌పై పంపడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## సుదూర ప్రాంతాలకు!

సాధారణంగా బదిలీలు స్థానిక నియోజకవర్గ పరిధిలో జరుగుతుంటాయి. కానీ తాజా ఉత్తర్వుల్లో నిబంధనలు గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శులను డోర్నకల్, పాలకుర్తి, ఇల్లందు వంటి సుదూర ప్రాంతాలకు పంపారు. కేసముద్రం ప్రాంతానికి చెందిన వారు గంగారం వంటి అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో నిత్యం 40 నుండి 50 కిలోమీటర్ల ప్రయాణం భారంగా మారింది. ఉదయం వెళ్తే రాత్రి వరకు ఇల్లు చేరని పరిస్థితి నెలకొనడంతో మహిళా కార్యదర్శులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## జేబులకు చిల్లు..

గతంలో స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పంచాయతీలకు నిధులు లేనప్పుడు, గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో కార్యదర్శులు తమ సొంత డబ్బులను లక్షలాది రూపాయలు వెచ్చించారు. "మేము పెట్టిన పెట్టుబడులు ఇంకా మాకు తిరిగి రాలేదు. ఇప్పుడు హఠాత్తుగా డిప్యూటేషన్‌పై వేరే చోటికి వెళ్తే, పాత బకాయిలు ఎవరు ఇస్తారు?" అని కార్యదర్శులు వాపోతున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు పాత బకాయిల చెల్లింపులకు సహకరించకపోవడం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

## మంత్రి ఆదేశాలే కారణమా?

ఈ సామూహిక బదిలీల వెనుక జిల్లాకు చెందిన ఒక ప్రముఖ మంత్రి మౌఖిక ఆదేశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కలెక్టర్ పై ఒత్తిడి తీసుకువచ్చి, అందరినీ ఒకేసారి కదిలించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే చర్చ మానుకోట జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతోంది. ఇది రెగ్యులర్ బదిలీ కాకుండా 'డిప్యూటేషన్' కావడంతో, రేపు మళ్లీ ఎక్కడికి పంపుతారో అన్న భయం ఉద్యోగులను వెంటాడుతోంది.

## మానవత్వం చూపండి: బాధితుల ఆవేదన

"మేము ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధమే. కానీ వికలాంగులను, గర్భిణీ స్త్రీలను అటవీ ప్రాంతాలకు పంపడం ఎంతవరకు సమంజసం?" అని పలువురు కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల పరిధిలో తమకు పోస్టింగ్ ఇవ్వాలని, మానవీయ కోణంలో ఈ డిప్యూటేషన్లను పునరాలోచన చేయాలని వారు వేడుకుంటున్నారు.



# కో-ఆప్షన్ ఎన్నికకు నామినేషన్

**నామినేషన్ వేసిన శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్**

డోర్నకల్, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం) :
డోర్నకల్ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్ల పర్వం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ వార్డు కౌన్సిలర్ శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్ తన నామినేషన్ పత్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌కు సమర్పించారు. మున్సిపాలిటీలోని నాలుగు కో–ఆప్షన్ స్థానాలకు గాను మాజీ ప్రజాప్రతినిధి కోటాలో భాగ్యలక్ష్మి నామినేషన్ వేశారు. మైనార్టీ కోటాలో మాజీ వార్డు సభ్యురాలు ఎస్.కె. ఫర్జానా అఫ్జల్, ఖాసీం కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా కౌన్సిలర్‌గా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాల సుమీర్ జైన్, ఉపాధ్యక్షుడు హరికృష్ణతో పాటు ముఖ్య నాయకులు మహేష్, ఎడమకంటి రవి, రెడ్డబోయిన శంకర్, ప్రవీణ్ బాబు, పవన్, కృష్ణమూర్తి, వాజిత్, వెంకటేష్, చొక్కారావు, రాజలి, స్వామి పాల్గొన్నారు.

# కబ్జాలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?

**- హరీష్ రావు అరెస్టుపై పెద్ది ఫైర్**

ప్రభాత గమనం, నర్సంపేట:
భూముల కబ్జాలు, మైనింగ్ దందాలపై ప్రశ్నించినందుకే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని అరెస్టు చేశారా అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. పరిగి నియోజకవర్గంలోని కళాపూర్, రాపోల్ గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూములు కోల్పోతున్న రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న సమయంలో హరీష్ రావును అరెస్టు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం, మంత్రులు చేస్తున్న మైనింగ్, భూముల దందాలను అసెంబ్లీలోనూ, మీడియా వేదికలపై ప్రశ్నిస్తున్నందుకే ఆయనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. కోకాపేటలోని నివాసంలో గృహనిర్బంధం చేసి అనంతరం అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పెద్ది పేర్కొన్నారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజల భూములను కబ్జా చేస్తోందని విమర్శించారు. కబ్జాలు, అక్రమ




మైనింగ్‌ను అరికట్టాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేయడానికి గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు. ఇటీవల అదిలాబాద్‌లో అరెస్టులు చేయవద్దని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు విరుద్ధంగా వ్యవహరించడం పిరికిపందా చర్యగా అభివర్ణించారు.

# మన ఇసుక వాహనం పథకంపై అవగాహన



మహబూబాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం):
ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' పథకంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం కలెక్టరేట్ టీజీ స్కేర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, మండలాల తహసీల్దారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్ నరేష్ ఆన్‌లైన్ ద్వారా ఇసుక కేటాయింపులు, బుకింగ్ విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన మేరకు ఇకపై ఇసుక సరఫరా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని స్పష్టం చేశారు. 'మన ఇసుక వాహనం' పథకంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ప్రజలకు సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీ మైనింగ్ వెంకటరమణ, డిపిఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు గాలికి..

- రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు!
- కోరుకొండపల్లిలో నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం



కేసముద్రం, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఉపాధి హామీ పథకం నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన ఈ పనుల్లో నిబంధనలు తుంగలో తొక్కారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఆర్ అండ్ బి రోడ్డు నుండి మాచర్ల లక్ష్మయ్య ఇంటి వరకు నిర్మించిన ఈ రోడ్డు కనీసం పది నెలలైనా మనుగడలో ఉంటుందా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**కొలతల్లో కోత.. ఇష్టారాజ్యంగా వెడల్పు**

నిబంధనల ప్రకారం ఈ రోడ్డు 12 ఫీట్ల వెడల్పుతో ఉండాలి. కానీ, నిర్మాణం చేసేటప్పుడు ఒక చోట 12 ఫీట్లు, మరోచోట 10 ఫీట్లు, ఇంకొన్ని చోట్ల అంతకన్నా తక్కువ వెడల్పుతో రోడ్డును వేశారు. అంతేకాకుండా, నిర్దేశించిన మందం (Thick-ness) కంటే తక్కువగా సీసీ పోసి, మిగిలిన మెటీరియల్‌ను పనులు చేసిన నాయకులు తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**క్యూరింగ్ ఊసే లేదు..**

సీసీ రోడ్డు పటిష్టంగా ఉండాలంటే కనీసం 15 రోజుల పాటు మడులు కట్టి నీటితో క్యూరింగ్ చేయాలి. అయితే, ఇక్కడ మాత్రం రోడ్డుపై వరి గడ్డి వేసి తూతూమంత్రంగా నీళ్లు చల్లి వదిలేశారు. నీళ్లు సరిగా పోయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తే.. 'రోడ్డు వేయడమే ఎక్కువ, ఎవరి ఇంటి ముందు వారు నీళ్లు పోసుకోండి' అని సదరు నాయకులు దబాయిస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్తంభం తీయకుండానే నిర్మాణం..**

రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండానే ఆఘమేఘాల మీద రోడ్డు వేయడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది. ప్రజాధనం వృథా కాకుండా, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హత్య కేసులో రౌడీ షీటర్ కు జీవిత ఖైదు



కేసముద్రం, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): వ్యక్తి హత్య కేసులో రౌడీ షీటర్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. కేసముద్రం మండల పరిధిలో 2020లో రైల్వే స్టేషన్ వద్ద ఓ బిచ్చగాడిని హత్య చేసిన ఘటనకు సంబంధించిన కేసులో గిర్ని తండాకు చెందిన అంగోత్ హరీష్ (30)ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు పూర్తి స్థాయి ఆధారాలు సేకరించారు. మహబూబాబాద్ కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగగా, న్యాయమూర్తి ఎండీ అబ్దుల్ నిందితుడిని దోషిగా తేల్చి మంగళవారం జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. అంగోత్ హరీష్ కేసముద్రంలో అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రజలను, వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడని పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి ఆధ్వర్యంలో పోలీసులు సమగ్రంగా దర్యాప్తు జరిపి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా పరిష్కరించిన కేసముద్రం పోలీసుల సేవలను మండల ప్రజలు అభినందించారు.



# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలి

**కలెక్టర్ స్నేహ శబరీష్**

మహబూబాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పరిశ్రమల పెట్టుబడుల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐపాస్, టీ-ప్రైడ్ పథకాల అమలుపై సమీక్ష చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ టీ-ప్రైడ్, తెలంగాణ ఐపాస్ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో టీఎస్ఐపాస్ చట్టం కింద వివిధ శాఖల అనుమతుల కోసం 30 యూనిట్లు రూ.36.90 కోట్ల పెట్టుబడితో దరఖాస్తు చేసుకున్నాయని చెప్పారు. అందులో ఇప్పటికే 64 అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. టీ-ప్రైడ్ పథకం కింద 2025 నవంబర్ 1 నుండి 2026 ఏప్రిల్ 7 వరకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వాహనాల మంజూరు చేపట్టినట్లు వివరించారు. ఇందులో ఎస్టీ వర్గానికి 42 యూనిట్లకు రూ.1,34,18,564 సబ్సిడీ, ఎస్సీ వర్గానికి 1 యూనిట్‌కు రూ.1,36,500 సబ్సిడీ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 43 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీలకు కమిటీ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస్ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, ఫ్యాక్టరీస్ శాఖ, కమర్షియల్ టాక్స్ శాఖ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారి తారక్ సాయి, సిబ్బంది ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- సైబర్ మోసాలు, మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
- తెలియని లింకులు ఓపెన్ చేయొద్దు.. ఓటీపీలు చెప్పొద్దు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో సీఐ సత్యనారాయణ




కేసముద్రం, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): యువత క్షణికావేశానికి లోనవకుండా జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే అనవసరంగా కేసుల పాలయ్యే ప్రమాదం ఉందని కేసముద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నాలుగో రోజు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసరమైన యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత అప్పుల పాలై తీవ్ర సమస్యల్లో పడుతున్నారని తెలిపారు. తెలియని లింకులను ఓపెన్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరుతుందని, ఓటీపీ వంటి గోప్య వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోన్‌ను నిర్లక్ష్యంగా ఉపయోగిస్తూ ప్రమాదాలకు గురికాకూడదని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం కుటుంబాలను దెబ్బతీస్తోందని తెలిపారు. సర్పంచ్ సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించిన సీఐ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముందు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. జి. రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ వీధులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతి, గ్రామ యువ నాయకులు ఉదయ్, అధ్యాపకులు మైసయ్య, ప్రవీణ్, యాదగిరి, రవి, రాజు, మున్ని, రమాదేవి, మంజుల, సలీం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుధవారం
08.04.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# పాఠశాల, ఆసుపత్రుల్లో కలెక్టర్ తనిఖీ

■ **హాస్టళ్లలో భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు), అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీ, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్స్, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను కచ్చితంగా అమలు చేసి, నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. వసతి గృహాలలో ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, బ్రేక్‌ఫాస్ట్, భోజనం, డిన్నర్ సమయాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రులను సందర్శించిన కలెక్టర్, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వివరాలు, మందుల స్టాక్ రిజిస్టర్ తదితరాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి మాతా-శిశు మరణాలను నివారించాలని, ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అక్రమ స్కానింగ్‌లు, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను నిర్వహించాలని, గర్భిణులు, చిన్నారులు, రోగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో తొర్రూరు ఆర్డీవో గణేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిసిఓ జయశ్రీ, ప్రిన్సిపల్ రత్నమాల, వైద్యులు సుగుణాకర్ రాజు, నందన దేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సేవలు అమూల్యం

■ **భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు 'ఆశా డే' శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ఆశా కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని, నిరంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా-శిశు మరణాలను నివారించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు ఎంతమందికి వైద్య సేవలు అందుతున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోజుకు సుమారు 70 మంది రోగులు వస్తున్నట్లు తెలపగా, ఓపి సేవలను మరింత పెంచాలని సూచించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ సర్వేపై ఉద్రిక్తత

■ **జీవో 98ను రద్దు చేయాలని డిమాండ్**

గార్ల, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ సర్వేను నిరసిస్తూ గార్ల మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్నేరు జలసాధన కమిటీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల ఆందోళనకు దిగారు. పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ విశ్వ జంపాల అన్నపానీయాలు మానేసి పోలీస్ స్టేషన్‌లోనే దీక్ష చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులు చికిత్స నిమిత్తం గార్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్వ జంపాలను తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గీన్నారపు మురళి తారక రామారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న మున్నేరు – పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించిన జీవో 98ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాజకీయ పార్టీ నాయకులు, జలసాధన కమిటీ సభ్యులను అక్రమంగా అరెస్టు చేయడం మానుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లలో నిర్బంధంలో ఉన్న నాయకులందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుదాం

■ **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుదామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల–జీజీహెచ్ ఆధ్వర్యంలో, మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సహకారంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్ పరిధిలో గల ప్రభుత్వ వైద్య కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అత్యంత మహత్తరమైన సేవ అని పేర్కొన్నారు. సమయానికి అవసరమైన వారికి రక్తం అందించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. యువత ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో వైద్య విద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములయ్యారు. రక్త సేకరణ ప్రక్రియను వైద్యులు పర్యవేక్షిస్తూ దాతలకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, జీఎంసీ ప్రిన్సిపల్ డా. నాగమణి, ఆర్ఎంఓ డా. కోటాచలం పాల్గొన్నారు.




## కేసముద్రం మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

■ **బీఆర్ఎస్ నాయకుడు కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్**




కేసముద్రం, ఏప్రిల్ 7 (ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పారిశుధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా మృతి చెందితే శవాన్ని ఉంచేందుకు ఫ్రీజర్ సదుపాయం లేకపోవడం దారుణమని వాపోయారు. ప్రస్తుతం ఉన్న ఫ్రీజర్ సేవలు నిరుపేదలకు భారంగా మారాయని, ఒక్కో శవానికి రూ.3,000కు పైగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పేద ప్రజలు ఎలా భరించగలరని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, వాటి వినియోగంలో పారదర్శకత లేదని, అభివృద్ధి పనుల్లో అమలు కనిపించడం లేదని విమర్శించారు. ఇకనైనా పాలకవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించి, మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374